హైందవ సమాజ ద్రోహులను విడచి పెట్టొద్దు : యాదవ్

చౌడేపల్లి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : తిరుమల-తిరుపతిలో జరుగుతున్న అన్యాయాలను, హైందవ సమాజ ద్రోహులను గుర్తించి శిక్షించాలని బిసివై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల లడ్డూ ప్రసాదం కలుసితం చేసిన క్రమంలో ఆయన తిరుమల పరిరక్షణ పాదయాత్రలో భాగంగా చౌడేపల్లికి చేరుకొని ప్రసంగించారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రసాదాలు, భక్తులు అమితంగా ఆరాధించి తెచ్చుకొనే లడ్డూ ప్రసాదంలో కల్తీలు, అవినీతి జరిగిందన్నారు. అదే విధంగా స్వామివారి దేవాలయం, ఆస్తులపై పెత్తనం చెలాయించి తీరని ద్రోహం చేసారన్నారు. టిటిడిలో పూర్తిగా ప్రక్షాళన గావించి రాజకీయ, కార్పోరేట్ కబంధ హస్తాల నుంచి దేవాలయాలను విముక్తి కల్గించాలన్నారు. స్వామివారి కైంకర్యాలకు వినియోగించే పూలను టిటిడి ఆధ్వర్యంలో పెంచుతున్నారన్నారు. అదే విధంగా ప్రసాదాల తయారీ నైవేద్యాలకు అవసరమయ్యే నెయ్యిని సైతం టిటిడిచే డెయిరీని ఏర్పాటు చేసి ఆ నెయ్యినే అన్నింటికీ ఉపయోగించాలన్న ఆవశ్యకతను తెలిజేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. దేశం నుంచి నలుమూలల నుంచి వచ్చిన పీఠాధిపతులు, భక్తుల ఆధ్వర్యంలో తిరుమల పరిరక్షణ పాదయాత్ర మొదలైందన్నారు. ఈ యాత్ర ఈనెల 30న అలిపిరి చేరుకొని మెట్ల ద్వారా మెట్లోత్సవం నిర్వహిస్తూ స్వామివారి దర్శభాగ్యం తర్వాత యాత్ర పరిపూర్ణమవుతుందన్నారు. అనంతరం వెంకటేశ్వరుని పవిత్రతు తెలుపుతూ పాదయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో బిసివై నాయకులు ధనుంజయ, హరినాథ్, భాను, నాగరాజ, వెంకట్రమణ, విజయ్, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

లడ్డూ కల్తీనెయ్యి నిగ్గుతేల్చేందుకు...

పూర్తిస్థాయిలో 'సిట్' విస్తరణ

-నేడోరేపో బాధ్యతలతో విచారణకు కార్యాచరణ

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: దేవదేవుడు వేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత భక్తులు అంతటి పవిత్రంగా భావించే లడ్డూప్రసాదాల తయారీకి జంతువుల కొవ్వునూనె, ఇతర శాఖాహార పదార్థాలతో నూనె కల్తీచేసిన నెయ్యి వినియోగించారనే వివాదంపై సమగ్ర దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సిట్ సిద్ధమైంది. ఇప్పటికే సిట్ బృందంలో గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్టత్రిపాటి నేతృత్వంలో అనకాపల్లి రేంజి డిఐజి గోపీనాథ్‌జెట్టీ, కడప జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజుతో బాటు సభ్యులుగా తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీ సీతారామారావు, జె.శివనారాయణస్వామి, సిఐ టి.సత్యనారాయణ అన్నమయ్యజిల్లా ఎస్‌బి, సిఐ కె.ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్‌జిల్లా, సిఐసూర్య నారాయణ కల్లూరులను నియమించారు. పూర్తిస్థాయిలో మందితో ఏర్పాటైన సిట్ రెండురోజుల్లో బాధ్యతలతో కార్యాచరణ రూపొందించుకుని రంగంలోకి దిగనుంది. చేపట్టనున్న దర్యాప్తు కీలకంగా మారనుంది. అసలు దేవుని ప్రసాదం లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు కల్తీనెయ్యి వినియోగించారనేది ప్రధాన అంశంగా ఉంది. లడ్డూల తయారీకి ఐదుమంది కాంట్రాక్టర్లు టెండర్లలో దక్కించుకున్న ఒప్పందం ప్రకారం సరఫరా చేయాల్సిన నాణ్యతప్రమాణాలతో నెయ్యికి బదులు నాసిరకంగా, జంతువుల కొవ్వునూనె కలిపారనేది ఇప్పుడు శ్రీవారి భక్తుల్లో విశ్వాసాలు సన్నగిల్లేలా చేశాయి. దీనిపై వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వం సిట్ బృందం ఏర్పాటు, పూర్తిస్థాయి అధికారాలు ఇచ్చింది. కల్తీ నెయ్యి బాగోతంపై ఎవరెవరికీనోటీసులు ఇస్తే ఎంతవరకు విచారణకు హాజరై సహకరిస్తారనేది కూడా కొంత ఆసక్తికర అంశంగా మారింది. ఇప్పటికే కల్తీ ఘటనపై ఏఆర్‌డైరీపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు.

కన్నుల పండువగా... తెప్పోత్సవం

-తెప్పలపై సేదతీరిన పార్వతీ తనయుడు

కాణిపాకం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల చివరిరోజు శుక్రవారం రాత్రి సిద్ధిబుద్ధి సమేత గణనాధుడు స్వామివారి పవిత్ర పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారికి శుక్రవారం తెప్పోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఉభయదేవేరులతో స్వామివారు స్థానిక పవిత్ర పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయహస్తం అందించారు. ఆలయంలో 21 రోజుల పాటు జరిగిన వార్షిక బహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవలలో ఊరేగుతూ అలసి సొలసిన స్వామి, అమ్మవార్లు చివరిరోజు తెప్పలపై విహరిస్తూ సేదదీరారు. ఈమేరకు శుక్రవారం స్వామివారికి తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥ శ్రీ గాలి పుండరీక నాయుడు, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ శ్రీ.ఆర్.శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ జి.హనుమంత నాయుడు వారి కుమారులు, అడపగుండ్లపల్లె, కీ॥శే॥ యం.రామకృష్ణారెడ్డి గారి కుమారుడు ఎం.జగన్నాధరెడ్డి, కాణిపాకం, చినకాంపల్లె, కీ॥శే॥ గురుజాల దామోదరనాయుడు, కొత్తపల్లె, కీ॥శే॥ చల్లగుండ్ల దామోదరనాయుడు వారి కుమారులు, కాకర్లవారిపల్లె, శ్రీగురుజాల ఆనందనాయుడు అండ్ బ్రదర్స్ దిగువ మారేడుపల్లె, శ్రీలంకిపల్లె మోహన్‌బాబు, బొమ్మసముద్రంలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు పగలు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అర్చకస్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చందన, బంగారు నగలతో దేదీప్యమానంగా అలంకరించారు. అనంతరం ధూపదీపనైవేద్యాలతో విశేష సమర్పణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే పుష్కరిణిలోని స్వామివారికి సాయంత్రం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తిరిగి రాత్రి సిద్ధి,బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ఆలయంలోని అలంకార మండపంలో వుంచి శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి వివిధరకాల పుష్పాలు, రంగురంగుల విద్యుత్‌ద్ధీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పలపై వుంచి మరోమారు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు మిన్నంటుతుండగా స్వామి అమ్మవార్లను పుష్కరిణిలో మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. ఈసందర్భంగా భక్తులు పుష్కరిణిలో

కిక్కిరిసిన భక్తజనం నడుమ తెప్పలపై ఊరేగుతున్న గణనాధుడు.

బెల్లంను వేసి మొకు ్కలు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చిత్తూరు డీఎస్పీ సాయినాద్ చిత్తూరు రూరల్ వెస్ట్ శ్రీధర్‌నాయుడుల అధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు విఘ్నేష్, చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్‌లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, జగన్నాధరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వడ్డీల వలలో... ప్రజలు విల విల

-రేణిగుంటలో వడ్డీ వ్యాపార భూతాలు -100కు 25 రూపాయలు వడ్డీ!



రేణిగుంట, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణంలో కొన్ని ప్రైవేటు ఫైనాన్స్(వడ్డీ వ్యాపార) భూతాలు బాధితులను పట్టుకుని పీడిస్తున్నాయి. భూతాల దాటికి తట్టుకోలేక బాధితులు లబోదిబోమని అల్లాడుతున్నారు. రేణిగుంట పట్టణంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు లేని కొంత మంది ప్రైవేటు ఫైనాన్సర్స్(వడ్డీ వ్యాపారులు) బాధితుల అవసరాలను బట్టి డబ్బులు ఇచ్చి అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారు. వసూలు చేస్తున్న వడ్డీలు శృతి మించి రాగాన పడుతున్నాయి. ఇందులో రకరకాల పద్ధతులు వడ్డీ వ్యాపారులు అవలంబిస్తున్నారు. ఖాళీ ప్రాంసరీ నోటు, వంద రూపాయల ఖాళీ స్టాంప్ పేపర్, ఖాళీ బ్యాంకు చెక్కు మీద సంతకాలు పెట్టించుకుని, అవసరాలను బట్టి ఏవైనా డాక్యుమెంట్లు తీసుకుని డబ్బులు ఇస్తారు. ఉద్యోగస్తులైతే ఏజీఎం కార్డు తీసుకుంటారు. చట్ట బద్ధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా అప్పు ఇస్తారు. ఒక్కొక్క వ్యాపారి వివిధ రకాల వడ్డీలు వసూలు చేస్తారు. ఈ వడ్డీలు వందకు ఐదు రూపాయలు నుంచి ప్రారంభమై 25 రూపాయల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. మరి కొంత మంది ఫైనాన్స్ వ్యాపారులు పిల్లల వడ్డీకి అప్పులు ఇస్తారు. అంటే 10 వేలు అప్పు ఇస్తే ప్రతిరోజు 10 రూపాయలు కట్టాలి. అలా ఎన్ని రోజులు బాధితుడు అప్పు కట్ట లేకపోతే వంద రూపాయలు ఇవ్వాల్సిందే. లేకపోతే వడ్డీని అసలు మొత్తంలో వడ్డీపై వడ్డీని వసూలు చేస్తారు. డబ్బులు వసూలు చేసే క్రమంలో వడ్డీ వ్యాపారులు బాధితులు నిర్వహిస్తున్న చిన్న చిన్న దుకాణాలకు తాళాలు వేస్తారు. కొంచెం వడ్డీ తగ్గించడం సాను...అంటూ బాధితులు కాళ్ళ వేళ్ళ పడినా డబ్బు అప్పు తీసుకునేటప్పుడు తెలియాదా...? కట్టాల్సిందే నంటూ వడ్డీ వ్యాపారులు నానఆ యాగి చేస్తారు. బాధితులు ఏమి చేయలేక వారు అడిగిన వడ్డీని కడుతున్నారు. కొంత మంది బాధితులు అసలు మాట అలా ఉంచి వడ్డీలు కట్టలేక ఇంకొక చోట డబ్బులు అప్పు తీసుకోవాల్సి వస్తుంది. దీంతో సదరు బాధితులు పూర్తిగా అప్పుల పాలై నానఆ అగచాట్లు పడుతున్నారు. వడ్డీలు కట్టలేక పోతున్నా కాస్త కనికరించండని బాధితులు ఎంత మొర పెట్టుకున్న వడ్డీ వ్యాపారులు ఏ మాత్రం జాలి, దయ లేకుండా కట్టాల్సిందేనట్టు మానసిక వేదనకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలోఎన్నో కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. బుగ్గ వీధికి చెందిన ఓ వడ్డీ వ్యాపారి వందకి 25 రూపాయల వడ్డీ వసూలు చేస్తున్నారని బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడానికి వడ్డీ వ్యాపారుల ధన బలం, రాజకీయ పలుకుబడిన వల్ల ఎలాంటి ప్రమాదం వస్తుందోనని బాధితులు భయపడుతున్నారు. వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని బాధితులు విలవిలాడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు జోక్యం చేసుకుని ఇలాంటి వ్యాపారుల ఆట కట్టించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. గత తెలుగుదేశం పాలనలో వడ్డీ వ్యాపారుల బారి నుంచి విముక్తి కలగడానికి పోలీసులు కాల్ మనీ కేసులు నమోదు చేసేవాళ్లు. ఇప్పుడు అలాంటి కేసులు నమోదు కాకపోవడంతో వడ్డీ వ్యాపారులు ఆడింది ఆట పాడింది పాటగాసాగుతోంది. వడ్డీ వ్యాపారుల ఆగడాలకు చెక్ పెట్టడానికి భారత ప్రధాన మంత్రి మోదీ చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా కేవలం ఆధార్‌కార్డు ప్రామాణికంగా రుణాలు ఇవ్వమని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చారు. వ్యాపార స్థాయిని బట్టి ఐదు వేల నుంచి రుణాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత బ్యాంకర్లకు ఉంది. ఈ రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకర్లు చిరు వ్యాపారులకు అనేక రకాల డాక్యుమెంట్లు తేవాలని హింసిస్తారన్న వాదనలు లేకపోలేదు. బ్యాంకర్లు నిరుపేద చిరు వ్యాపారులకు ముద్ర లోన్లు ఇవ్వడం అటు నుంచి వాళ్లు కూడా బడా బాబులకే లోన్లు మంజూరు చేస్తున్నారని విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి.

ఇక్కడ నుండి కదలం.. కుర్చీలు వదలం!

-బదిలీ ఉత్తర్వులు ఇచ్చినా బేఖాతర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థలో సుదీర్ఘకాలంగా తిష్ట వేసిన గత వైసిపి పెద్దలుతో నిత్యం టచ్‌లో ఉంటూ, గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఇద్దరు అధికారులకు బదిలీ వచ్చినా వారం రోజులుగా కుర్చీలు వదలడం లేదు. దీనిపై నగర పాలక సంస్థ కార్యాలయంలో పెద్ద చర్చే జరుగుతోంది. రెవెన్యూ విభాగంలో కీలకమైన అధికారి ఒకరు మరొకరు ఆర్ఓ హోదాలో కార్యాలయంలో సముచిత పదవిలో కొనసాగుతున్న అధికారి. ఆ ఇద్దరూ కూడా గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో బయట మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేసి అప్పటి టిడిపి నేతలను భయపెట్టి వైసిపి పెద్దలకు అనుకూలంగా పనిచేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత వైసిపి పెద్దలు ఆశీస్సులుతోనే మళ్ళీ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్థానాలు పదిలం చేసుకున్నారు. జంట పదవులు అనుభవిస్తూ బదిలీలు చేసినా ఇక్కడ నుంచి వెళ్లం అని తిష్టి వేస్తున్నారు. గత కొంత కాలంగా వీరి వ్యవహారం, పనితీరుపై ఆరోపణలు, అధికార కూటమి పార్టీ నేతలకు మింగుడు పడలేదు. దీంతో సాధారణ బదిలీల్లో ఒకరికి బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పరిపాలన అధికారిగా, మరొకరికి అమలాపురం డెవలప్మెంట్ అథారిటీలో ఏఓగా బదిలీ చేశారు. అయితే ఇద్దరు తిరుపతిలో ఎన్నో ఏళ్లుగా తిష్టి వేసిన వాళ్ళకు బదిలీ వచ్చినా ఇప్పుడు కుర్చీలు వదలడం లేదు. ఇప్పటికి ఇంకా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో సుదీర్ఘకాలంగా కుర్చీలు అట్టిపెట్టుకుని వైసిపికి అనుకూలంగా ఉన్న ఉద్యోగులు కూడా ఉన్నారు. ఇంకా వారినే అధికార ప్రభుత్వం కొనసాగిస్తుండటంతో ప్రజలు పలు రకాలుగా మాట్లాడుకొంటున్నారు. మరీ కమిషనర్ దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

రాయలవారి కోటలో లైటింగ్ షో షురూ..!

ఘనంగా పర్యాటక దినోత్సవ వేడుకలు- పర్యాటక రంగ అభివృద్ధికి మెరుగైన అవకాశాలు-జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

చంద్రగిరి, సెప్టెంబర్ 27 ప్రభాత వార్త: చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోటలో గురువారం రాత్రి సౌండ్ అండ్ లైటింగ్ షో అట్టహాసంగా ప్రారంభించుకున్నట్లు తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులతో కూడిన హెరిటేజ్ వాక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రాయలవారి కోటకు చేరుకున్న ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి మెరుగైన అవకాశాలు వున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో తిరుమల, శ్రీకాళహిస్తి వంటి పుణ్యక్షేత్రాలతో పాటు బీచ్ రిసార్ట్‌లు, జలపాతాలు కలిగిన పర్యాటక ప్రదేశాలు వున్నట్లు తెలిపారు. పర్యాటక ప్రేమికులకు రాయలవారి చరిత్ర పట్ల అవగాహన కల్పిస్తూ లైటింగ్ షో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2017లో భారీ వర్షాలకు పిడుగుపాటుకు గురై కోటలోని సౌండ్ అండ్ లైటింగ్ వ్యవస్థ ధ్వంసమయ్యిదన్నారు. ఈ నేపథ్యంలో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, లక్స్ అండ్ డెసిబెల్స్ ప్రైవేటు భాగస్వామ్యంతో పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ (పి.పి.పి.) విధానంతో రూ.6 కోట్లు వెచ్చించి సౌండ్ అండ్ లైట్స్ వ్యవస్థను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా పర్యాటకుల కోసం త్వరలో ఫుడ్ కోర్టు, బోటింగ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసం రచన పోటీలలో ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహక బహుమతులు అందజుశారురు. విద్యార్థులకు ఈ కార్యక్రమంలో ఏపిటిడిసి డివిఎం గిరిధర్ రెడ్డి, ఈఈ సుబ్రమణ్యం, పర్యాటక శాఖ జిల్లా అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, ఆర్కియాలజీ సబ్ సర్కిల్ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్, లక్స్ అండ్ డిసిబుల్స్ ప్రతినిధి శివ, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ బాలాజి నాయక్, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, నాయకులు సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, సింగు సుధ, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, గౌస్‌భాషా, కొండూరు ప్రవీణ్ రాయల్, శానంబట్ల తులసి రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, ఎంపిడిఓ ఏఓ రవిచంద్ర, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రైవేటు మద్యం దుకాణాలు

కోట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటి స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు టెండర్లు పిలవనున్నారు. జిల్లాలో అత్యధికంగా మద్యం దుకాణాలకు గూడూరు డివిజన్‌లో టెండర్లు జరగనున్నాయి. ఒకటీ రెండు రోజుల్లో టెండర్ల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. దుకాణాలను దక్కించుకోవాలని భావిస్తున్న రాజకీయ నాయకులు, వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. మరికొందరు టెండర్లు వేయకుండా రాజకీయ పలుకుబడిని కూడా ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం దుకాణాలకు టెండర్లు వేయకముందే కొందరు రాజకీయ నాయకులు ఆ దుకాణా మాది అని ప్రచారం చేసుకుంటున్నట్లు చర్చ సాగుతోంది. ఇతరులు టెండర్లు వేసినా ఫలితం ఉండదని చెబుతున్నారు. మరికొందరు ఇతర పేర్ల మీద టెండర్లు వేసి ఎక్కువ దుకాణాలు సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. దీంతో ఈ సారి పెద్దఎత్తున టెండర్లు వేసే అవకాశం ఉంది. మద్యం దుకాణానికి రీఫండబుల్ మొత్తం రూ.2 లక్షల దాకా ఉంటుందని గుత్తేదారులు భావిస్తున్నారు. దీంతో లాటరీలో టెండరు ఎవరికి వచ్చినా గుడ్‌విల్ ఇచ్చి దుకాణాలను దక్కించుకోవాలని చాలామంది ఆలోచిస్తున్నారు. నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో విక్రయాలు పెరిగే అవకాశం ఉందని గుత్తేదారులు భావిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో పక్కాగా...

కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షక కమిటీ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్

స్వర్ణాంధ్ర-2047 విజన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశభవనంలో శుక్రవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అధ్యక్షులుగా, కలెక్టర్ సుమిత్‌కుమార్ కార్యదర్శిగా మొదటి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షక కమిటీ సమావేశం(దిష) జరిగింది. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ థామస్, డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు మేయర్ అముద, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సిమెంటు రోడ్లు, మురికినీటి కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో పని చేసి జిల్లాను ప్రగతి పథంలో నిలబెట్టడానికి ప్రతి ఒక్కరు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల్లో వైద్యుల కొరత, వైద్య పరికరాలు లేకపోవడం, నూతన భవన నిర్మాణాలు లేకపోవడం వంటి సమస్యలు వున్నాయని దీనిపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలందరితో కలిసి ఆరోగ్యశాఖ మంత్రికి నివేదించడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆదేశించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి 14, 15 ఆర్థిక సంఘ నిధులను వినియోగించాలని, గ్రామాల్లో పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాలు, ఇతర మౌళిక వసతుల కల్పినను పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ పాడి రైతులకు గోకులం షెడ్లను విరివిగా మంజూరు చేయాలని, టిడ్కో, హౌసింగ్ కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ మొగిలి ఘాట్ రోడ్డులో తరచు ప్రమాదాలు జరిగి భారీ ప్రాణ నష్టం జరుగుతున్నప్పటికీ నేషనల్ హైవే అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 13న మొగిలి ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగి భారీ ప్రాణ నష్టం జరిగిన సమయంలో మానవతా ధృక్పదంతో ఎంతో మంది సహాయం చేస్తే ఒక్క నేషనల్ హైవే అధికారులు మాత్రం సంఘటనా స్థలానికి రాకపోవడం బాధ్యతారాహిత్యం అన్నారు. మొగలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి పక్కాగా చర్యలు తీసుకోవాల్సి వుందన్నారు. జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ రానున్న మామిడి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఇప్పటి నుండి ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు స్వర్ణాంధ్ర-2047 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ శంకర్‌నారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, హౌసింగ్ పిడి పద్మనాభం, డ్వామా పిడి రవికుమార్, డిఇఓ దేవరాజులు, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, డిఎస్ఓ శంకరన్, సిపిఓ సాంబశివారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 8లక్షల రూపాయల విరాళం

శాంతిపురం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : విజయవాడ వరద బాధితుల కోసం శాంతిపురం మండలం తరపున 8.33లక్షల రూపాయల విరాళాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు అందించారు. ఈసందర్భంగా ఆయన వరద సాయం అందించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, నాగరాజు, రమేష్, చంద్రారెడ్డి, బాలు, శంకర్, లోకేష్, సింగిరి శ్రీనివాసులు, మురుగన్, బాలకృష్ణ, శ్యామలమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేద్దాం

రామకుప్పం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. శుక్రవారం కెంచనబళ్లలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం సభలో వారు మాట్లాడారు. సిఎంగా చంద్రబాబునాయుడు తొలిసంతకం మెగా డిఎస్సీకి చేశారన్నారు. వంద రోజుల పాలనలోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. కుప్పంనియోజకవర్గానికి ఐదువందల గోకులం షెడ్లు మంజూరు చేశారన్నారు. రామకుప్పంకు పెద్ద పరిశ్రమ తేవాలని సిఎం చొరవ చూపుతున్నారన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లను స్థానిక నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, పట్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, నేతలు ఆంజనేయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, రామూర్తి, చంద్రారెడ్డి, రఫీ, రాజసింహ, హరీష్, విశ్వనాథ్, వెంకటాచలం, బాలు, సుబ్రి, వెంకటరమణ, సత్తి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

రామకుప్పం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండలంలో పెండింగ్‌లో ఉన్న ఐదువేల మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎంపిడిఒ ఈశ్వరన్ కోరారు. మండల కార్యాలయంలో మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వాలు 15వేలు చెల్లిస్తాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డిఎల్‌పిఒ రాధాకృష్ణ, నేతలు నరసింహులు, విశ్వనాథ్, సుబ్రి, బాలు, డిఇ సుబ్రమణ్యం, ఎపిఒ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దారుగా శ్రావణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

పెనుమూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: పెనుమూరు తహస్దిల్దారుగా శ్రావణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణి చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా తహసిల్దారు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలను త్వరితంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎదైనా భూ సమస్యలు వుంటే నేరుగా తనకే నివేదించాలని, తాను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డును శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ డంపింగ్ యార్డులో వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ యూనిట్లను పరిశీలించి వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, విక్రయాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టి.చవటపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి అక్కడ రోగులకు అందుబాటులో వున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో అమలు అవుతున్న టీకాల వైద్య సిబ్బందితో ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరసింహపాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీర్‌గా వెంకటరామిరెడ్డి

చిత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్‌గా వెంకటరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో చిత్తూరులో విధులు నిర్వహిస్తున్న ఎంఇ గోమతిని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇఇగా విధులు నిర్వహిస్తున్న వెంకట్రామిరెడ్డిని చిత్తూరు ఎంఇగా బదిలీ చేసింది. ఈ మేరకు ఎంఇగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రామిరెడ్డి మేయర్ అముద, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మహాపరాధానికి ప్రాయశ్చిత్తమే సరైన మార్గం

పుంగనూరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకట రమణస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఉదయం జనసేన ఆధ్వర్యంలో ప్రాయశ్చిత పూజలు జరిగాయి. నియోజకవర్గ కన్వీనర్ చిన్నారాయల్ అధ్వర్యంలో జరిగిన ఈపూజల సందర్భంగా ఉదయం పట్టణంలో జనసేన నాయకులు,కార్యకర్తలకు వివిధ హిందూ సంఘాలు మద్దతునిచ్చాయి. చిన్నారాయల్ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన మేమేసైతం కార్యక్రమంలో ఆయన పిలుపు మేరకు రాష్ట్రం మొత్తం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాలలో ప్రాయశ్చిత్త దీక్షలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు...పట్టుబడిన అంతర్రాష్ట్ర ముఠా

పుంగనూరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త : వ్యసనాలకు బానిసైన ఐదు మంది యువకులు ముఠాగా ఏర్పడి చేస్తున్న ద్విచక్రవాహనాల చోరీను పోలీసులు చేధించారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నక్కబండకు చెందిన హుసేన్, ముళబాగిల్‌కు చెందిన వసీం,ముబారక్,ఆసిఫ్‌లతో పాటూ మరొక వ్యక్తి కలసి మండలంలోని చదళ్ళ వద్ద ఒక ఇంటిని బాడుగకు తీసకుని, పట్టణంలో ద్విచక్రవాహనాల చోరీలకు తెగబడ్డారు. ఇలా వీరు ఏకంగా 23 వాహనాలను పట్టణ,గ్రామీణ ప్రాంతాల నుంచి చోరీచేసి,ద్విచక్రవాహనాల వ్యాపారంపేరుతో చలామణి అవుతూ వచ్చారు. వీరి వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉండడంతో సరి ్కల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆదేశాలతో ఐడి టీం రంగంలోనికి దిగింది. వీరుచేస్తున్న చోరీల గురించి,వాహనాలను దాచి ఉంచిన వ్యవహారం గురించి మొత్తం తెలుసుకుని ఏకకాలంలో దాడులుచేయడంతో నలుగురు నిందితులు పట్టు బడ్డారు.నిందితులనుకోర్టుకుతరలించేముందుపోలీస్‌స్టేషన్‌ఆవరణలోవిలేకరులసమావేశంలో హాజరుపరిచారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా స్వర్ణాంధ్ర 2047 వేడడుకలు

వెదురుకుప్పం,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తలపెట్టిన స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాన్ని కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని స్వర్ణాంధ్ర ఎట్‌ది రేట్ ఆఫ్ 2047 అనే కార్యక్రమం రూపకల్పన చేసిందని విద్యార్థులకు పథకం అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కో ఆర్డినేటర్ వెంకటేష్, భీమ మెహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు

వెదురుకుప్పం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని దేవళంపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైన్నట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయులు తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన చైతన్య, సంజయ్, మోహిత్‌లు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన్నట్లు తెలిపారు. వీరి ఎంపికపట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మైనార్టీలకు అండగా నిలిచింది సిఎం చంద్రబాబే

– కుప్పంలో ఉర్దూ జూనియర్ కాలేజ్ మంజూరు !!

– ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉన్న మైనార్టీలకు అండగా నిలిచింది సిఎం చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 18వవార్డు ప్రకాశం రోడ్డులో జరిగిన వార్డు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నెలరోజులలోపే కుప్పానికి ఉర్దూ జూనియర్ కాలేజ్ మంజూరు చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత తెదేపా పాలనలో మైనార్టీలకు రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, దుకాన్ మకాన్ పథకం, మసీదుల మరమ్మత్తులకు నిధులు, ఇమాం,మౌజన్‌లకు గౌరవేతనాలు అందించారన్నారు. అర్హులకు కార్పోరేషన్ రుణాలు అందించారని పేర్కొన్నారు. 250 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల సుందరీకరణ, లైట్లు, ఇతర మౌలిక వసతుల కల్పన చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు, రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు జాకీర్, వేలు, నేతలు సర్దార్, అన్సర్, హిదయతుల్లా, ముజీబ్, ఆర్ముగం, సుబ్బు, మంజు, ఆర్ఆర్ రవి, ఉమేర్, ఖాసీం, ఇస్మాయిల్, జాలు, భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరుమగళ్, దయాకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

అంతర్ జిల్లాల క్రీడా పోటీలకు ఇద్దరు ఎంపిక

సదుం,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండల పరిధిలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఇద్దరు వాలీబాల్, రన్నింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పాఠశాలలో చదివే మహేందర్ నాయుడు, లోహిత్ కుమార్‌లు విశేషప్రతిభ కనపరచి చిత్తూరులో ఎస్‌జీఎఫ్ అండర్ 17 పోటీలలో మంచి ప్రతిభ కనపరచారు. లోహిత్ వాలీబాల్, మహేందర్ నాయుడు రన్నింగ్,లాంగ్‌జంప్ పోటీలలో పాల్గొని విశేష కనపరచారు. శ్రీకాకుళంలో జరిగే అంతర్ జిల్లాల పోటీలకు ఎంపికైనారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులను అందరు అభినందించారు.

మొక్కలు నాటడం వల్ల మావాళికి మేలు

సదుం,సెప్టెంబర్ 27ప్రభాతవార్త : మొక్కలు నాటడం పెంచడం వల్ల మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పచ్చార్ల ప్రాజెక్టు వద్ద స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్ బి.అమరనాథ్, సైన్సు ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, రెడ్డిరాణి, కుమారి, ఆంగ్ల ఉపాధ్యాయులు ఆంజేయులు, రిపజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపదీ కల్యాణోత్సవం

సదుం,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండల కేంద్రానికి దగ్గరలో భట్టువారి పల్లెలో నిర్వహిస్తున్న మహాభారత కార్యక్రమంలో శుక్రవారం ద్రౌపదీ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా జరుగుతున్న మహాభారత కార్యక్రమంలో మధ్యాహ్నం పాండవుల ఆలయం వద్ద ద్రౌపదీదేవి కల్యాణోత్సవం నిర్వహించారు. దాసరి నారాయణ దంపతులు, కబడ్డీ మల్‌రెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాదరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సదుం మండల ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి, చిన్నరమణ, రామాంజులు, మునిరత్నం, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి మండల పూజ

కల్లూరు, సెప్టెంబర్ 27ప్రభాతవార్త : పులిచెర్ల మండలం కావేటిగారిపల్లెలో శుక్రవారం ఉదయం వీరాంజనేయస్వామి వారి మండల పూజ నిర్వహించారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ట,కుంభాభిషేకం నిర్వహించి 41 రోజులుపూర్తి కావడంతో మండల పూజ నిర్వహించారు. మూర్తి చెంగయ్య,కమలమ్మ, యుగందర ్, పూర్ణిమ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వల్లంశెట్టిసుబ్రమణ్యం,పూర్ణేష్‌తదితరులు గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో ప్రాయశ్చిత శాంతి హోమం

బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రాయశ్చిత శాంతి హోమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆలయ ఇఓ, ఉపకమీషనర్ జె.ఏకాంబరం ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్దగల మండపంలో వేద పండితుడు గోవర్ధనశర్మచే ప్రాయశ్చిత శాంతి హోమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అధికార, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

కోట ఎపిఎంగా అనిల బాధ్యతలు స్వీకరణ

కోట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : కోట ఐకెపి ఎపిఎంగా అనిల శుక్రవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎపిఎం రత్నయ్య చిల్లకూరు మండలానికి బదిలీపై వెళ్లారు. వెంకటాచలం మండలంలో పనిచేస్తున్న ఎపిఎం అనిల కోటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోట మండలంలో అర్హత కలిగిన ప్రతి సంఘానికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పారు. మహిళలకు జీవనోపాధి పెంపొందించి ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎన్నో రాయితీలు ఇస్తుందని చెప్పారు.

ఎమ్మెల్యేచే ప్రభుత్వాసుపత్రికి ఫ్రీజర్ పంపిణీ

గూడూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తన తండ్రి పాశం పెంచలయ్య జ్ఞాపకార్థం సుమారు 80 వేల రూపాయిలు విలువ చేసే ఫ్రీజర్‌ను శాసనసభ్యులు సోదరులు పాశం సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా ఆసుపత్రి సిబ్బందికి అందించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో ఎవరైనా చనిపోతే వారి దేహంను భద్రపరుచుటకు ఫ్రిజర్ లేదని శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ దృష్టికి హాస్పిటల్ వారు తీసుకురావడంతో వెంటనే స్పందించి ఫ్రీజర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లెల శ్రీనివాసులు, గుండాల ఓంప్రకాష్, బత్తిన ప్రణీత్ యాదవ్, ముప్పా చరణ్, వేముల సునీల్, పురిణి దయాకర్, అల్లం వెంకటసాయి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గూడూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని వల్విపేడు గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన డేగ రామయ్య కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆ కుటుంబానికి 12 వేల రూపాయిలు ఆర్థిక సాయం చేశారు. అలాగే ఉడతావారిపాలెం గ్రామంలో జర్నలిస్టు కిషోర్ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అంత్యక్రియల కోసం పది వేల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నంద కుమార్, రత్నయ్య, శంకరయ్య, నాగరాజు, షఫీ, శివయ్య, మహేశ్వరయ్య, సుధాకర్, పెంచలయ్య, వినోద్, కస్తూరయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కారు మోటర్ బైక్ ఢీ:ఇద్దరికి గాయాలు

బాలాయపల్లి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని పచ్చవారుచేను గ్రామం వద్ద కారు మోటర్ బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిలో ఒకరు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వెంకటగిరిలో పోలేరమ్మ జాతర చూసుకొని తిరిగి గూడూరుకి బైక్‌లో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

పోలేరమ్మ హుండి లెక్కింపు

వెంకటగిరి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి జాతర సందర్భంగా భక్తులు హుండీలో వేసిన నగదును దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. రు.100, రు.300 రూపాయిలు టికెట్ల ద్వారా 26 లక్షల 74 వేల రూపాయిలు, హుండీలో పడ్డ నగదు 22,51,975 రూపాయిలు వచ్చింది. గత సంవత్సవం టికెట్ల ద్వారా 33 లక్షల రూపాయిలు, హుండీ ద్వారా 21 లక్షల 91 వేల రూపాయిలు ఆదాయం వచ్చింది. టికెట్ల ద్వారా గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం 7లక్షల రూపాయిలు తగ్గింది.

స్వర్ణాంధ్ర లక్ష్యం దిశగా అడుగులేస్తున్న రాష్ట్రం

బాలాయపల్లి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : స్వర్ణాంధ్ర లక్ష్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తహశీల్దార్ కెవిఆర్‌కె ప్రసాద్ రావు తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లి గ్రామ సచివాలయం ఆవరణంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం దిశగా భారతదేశం సమగ్ర అభివృద్ధి సాధించాలని, ప్రపంచ మూడు అగ్రగామి ఆర్థిక శక్తుల్లో ఒకటిగా ఎదగాలని సంకల్పంతో మండలంలో గ్రామ సభలు జరిగినట్లు తెలిపారు. విద్యా నైపుణ్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, సుస్థిరత, వాతావరణ సమతుల్యత, ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయం, ఆహార శుద్ధి, ప్రకృతి వ్యవసాయం అంశాలపై చర్చించారు. సర్పంచ్ దట్టం అంజలి మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం ఈ గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పంచాయతీల కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ మన ఇల్లు మన గౌరవం పేరిట ప్రభుత్వం ఇళ్ళులేని వారిని ఆర్థికంగా ఆదుకొంటుందని అన్నారు. ఈ గ్రామ సభలో గ్రామసచివాలయఉద్యోగులు సర్పంచి దట్టం అంజలి, వీఆర్వో శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి

గూడూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త : రైల్వే స్టేషన్‌లో పనిచేసే శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గూడూరు రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావుకు శానిటేషన్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో పనిచేసే శానిటేషన్ కార్మికులకు జీతాలు ప్రతి నెల సక్రమంగా చెల్లించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్‌ను అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ పార్టీ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు నాయకులు సురేష్, బివి రమణయ్య, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటారు : నేదురుమల్లి

వెంకటగిరి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్త లకు అండగా ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 11వ వార్డు కౌన్సిలర్ తంబ సుకన్య, జగదీష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను రామ్ కుమార్ రెడ్డి పర్యామర్శించారు. కౌన్సిలర్ సుకన్య కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా అండగా నిలుస్తానని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బాల య్య,వైసిపిజిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు కళ్యాణి, శంకరయ్య, సుబ్బారావు, పాల్గొన్నారు.

గ్రామ సభలో మన ఇల్లు మన గౌరవం

వాకాడు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : వాకాడు మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని శుక్రవారం సర్పంచ్ కడూరు రామయ్య అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడివో మనోహర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ 2047, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం గురించి, మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంపై మాట్లాడారు. గతంలో మంజూరు చేసిన పక్కా గృహాలు నిర్మాణం చేపట్టిన వారు పూర్తిస్థాయిలో నిర్మాణం మొదలుపెడితే తక్షణం బిల్లులు లబ్ధిదారు అకౌంట్‌లో పడతాయి అన్నారు. మండలంలోని 14 పంచాయితీలలో గ్రామ సభలో జరిగాయి. శనివారం ఐదు పంచాయితీలు సచివాలయంలోని గ్రామ సభలో నిర్వహించబడతారని ఎంపిడివో మనోహర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే నవ సమాజ ఆవిష్కరణ

చిత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: పరిశుభ్రతతోనే నవ సమాజం ఆవిష్కారం అవుతుందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్

తిరుపతి డివిజన్

భక్తి మార్గమే ముక్తికిసోపానం

తిరుపతి,సెప్టెంబర్ 27ప్రభాతవార్త: శ్రీవారికి ఎంతో పవిత్రమైన పెరటాసి మాసంలో ఆధ్యాత్మికవాతావరణంలో తిరుపతి అన్నమాచార్య కళామందిరం కళకలలాడుతోంది. శుక్రవారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి రమేశ్‌బాబు డిపిపి ఆధ్వర్యంలో ప్రవచనాలు చేస్తున్నారు. నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ సంద ర్భంగా శుక్రవారం సాయంత్రం గరికపాటి రమేశ్‌బాబును రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, పుత్తూరు శివప్ర సాద్‌రెడ్డి, సురేష్‌స్వామి దుశ్శాలువతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

సేవ్ తిరుమల సేవ్ టిటిడి

తిరుపతి,సెప్టెంబర్ 27ప్రభాతవార్త: తిరుమల ఆలయ సాంప్రదాయాలను పాటించాని, ఎవరైనా హిందూయేతరులు ధర్మపరిరక్షణకు సహకరించాలని స్వాములు కోరారు.శుక్రవారం జనసేన నేత కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో సేవ్ తిరుమల సేవ్ టిటిడి నినాదంతో సమావేశంజరిగింది. హిందూ సంప్రదాయం పరిరక్షణ ముఖ్యమన్నారు.

బస్సు ఆటో ఢీ...ఐదుగురికి గాయాలు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూరుపేట తెట్టు వద్ద శుక్రవారం ఆర్‌టిసి బస్సు ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఐదుగురు గాయపడినట్లు సమాచారం. టూటౌన్ పరిధిలోని తెట్టు వద్ద నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తికి వస్తున్న వాకాడు ఆర్‌టిసి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శ్రీకాళహస్తి నుంచి విఎంపల్లికి ప్రయాణీకులతో వెళుతున్న ఆటోను ఢీకొంది. అయితే రెచ్చిపోయిన అక్కడ జనం ప్రమాద సంఘటన చూసిన వెంటనే స్పందించారు. చలించారు.బస్సు ముందు భాగం అద్దాలను పగుల గొట్టారు. ఆటోలో ప్రయాణిస్తున్న సున్నపు హరిజనవాడకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటాచలం, సుగుణ, విజయలక్ష్మి, చిన్నక్క, ఇందిరలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యఖుర్ ఆన్ మొదటి సందేశం పరిశుభ్రత,విద్య నేర్చుకోవటమే

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : దివ్యఖుర్ ఆన్ మొదట సందేశం చదువు నేర్చుకోవటం,పరిశుభ్రత పాటించటమే అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ వివరించారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన తన ప్రసంగంలో తప్పని సరిగా పాటించాల్సిన కలిమా, నమాజు, రోజా, జకాత్, హజ్‌ల కన్నా మొట్టమొదటి సందేశం సంప్రదాయ అరబ్బిని నేర్చుకోవాలన్నదే అని వివరించారు.నేడు మనం మన సంప్రదాయాలను సంస్కృతిని విస్మరించామన్నారు. ఇక మసీదుల్లో మరుగుదొడ్ల శుభ్రత కేవలం మసీదు కమిటీలది, మౌజన్‌లది కాదన్నారు.ప్రతి ఒక్క ముస్లింలది అన్నారు.అంతేకాక మసీదు పరిశుభ్రత కూడా ప్రతి ముస్లింపై ఉందని గుర్తించాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరు ఐదుపూటలా నమాజులు ఆచరించాలన్నారు. మన కట్టుబొట్టు సంప్రదాయ పద్ధతిలో ఉండాలన్నారు.

వైకాపా నేతలకు పోలీసుల నోటీసులు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన సందర్భంగా పోలీసులు ముందు జాగ్రత్తగా వైకాపా నేతలను హౌస్ అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆరోపించారు. శుక్రవారం జగనన్న తిరుమల పర్యటనకు వస్తున్నారని తెలుసుకున్న పోలీసులు వైకాపా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. అంతేకాక అర్ధరాత్రి దాటిన తరువాత తనకు టౌన్ పోలీసులు నోటీసులు జారి చేసారని ఇది ప్రజాస్వామ్యమా? లేక నియంతృత్వమా? అని ప్రశ్నించారు.

జంలేపీర్‌షావలి అల్లాహ్‌ను దర్శించుకున్న కోలా

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని జీవనది స్వర్ణముఖి ఒడ్డున వెలసిన జుంలేపీర్ షావలి అల్లాహ్ దర్గాలో శుక్రవారం రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ తన సహాచరులతో కలసి దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో వలీఅల్లాహ్‌కు పూల దుప్పటిని సమర్పించారు. ఆయనకు మేళ తాళాలతో ముజావర్ సయ్యద్ అహ్మద్,బాబాఫరీద్ వారి అనుచరులు, గంధోత్సవం కమిటి అధ్యక్షుడుఓరుగంటి నాగేశ్వరరావు,జమ్రుద్ బాషా,గరికపాటి రమేష్‌బాబు తదితరులు స్వాగతం పలికారు.

అధికారుల బదిలీ జాతర

శ్రీకాళహస్తి/.తొట్టంబేడు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకకవర్గంలో బదిలీల జాతర మొదలైంది. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న రూప్‌చంద్ స్థానంలో నాగలాపురంలో డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎకె.ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించగా, తొట్టంబేడులు డిప్యుటీ తహశీల్దార్‌గా సుదీర్ఘకాలంగా పనిచేసిన సుధీర్‌రెడ్డి వడమాలపేటకు బదిలీకాగా ఇక్కడకు శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.జగన్‌మోహన్ బాధ్యతను స్వీకరించారు.ఇక తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో డిప్యుటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(డిఐ) రాఘవయ్య బాధ్యతలు చేపట్టారు.శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన బి.నారాయణస్వామిని తొట్టంబేడు మండల తహశీల్దార్ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక వరదయ్యపాళెంలో డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న పి.శాంతి శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో డిప్యుటీ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. సత్యవేడులో ఈడిటిగా పనిచేస్తున్న పి.రవిచంద్రబాబును శ్రీకాళహస్తి ఈడిటిగా నియమించారు. తిరుపతిలో డిసిఎస్ఓ డి.మాధురి శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి డిప్యుటీ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇక ఆర్‌సిపురంలో డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎల్.పునీతరాణిని శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాయంలో డిటిగా నియమించారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.మునిరాజమ్మను శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి బదిలీచేశారు. తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన బి.రమాకాంతరావును(ఎలక్షన్స్) శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో సినియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. చంద్రగిరిలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యు.ఉషారాణిని శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి బదిలీచేశారు. ఇక శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో ఈఎస్‌ఏగా పనిచేస్తున్న ఎం.నల్లయ్యను శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీచేశారు. ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా కె.వంశీకృష్ణ, తొట్టంబేడు మండలానికి జూనియర్ అసిస్టెంట్‌గా బి.ధనలక్ష్మిని నియమించగా బుచ్చినాయుడుకండ్రిగలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.విరాజితను నియమించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు తొలుత శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శివయ్యను దర్శించుకుని వారివారి కార్యాలయాల్లో విధుల్లో చేరారు.

చోడవరం గ్రామంలో ఉచిత వైద్యశిబిర

తొట్టంబేడు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని చోడవరం గ్రామంలో దొడ్లడైరీ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశువైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పాడిరైతులకు ఉచితంగా మందులు పశువులకు వైద్యసేవలను ఉచితంగా అందించారు. డాక్టర్ బి.ఉషా ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో నెల్లూరుజిల్లా ప్రొక్యురిమెంట్‌హెడ్ కె.యుగంధర్‌రెడ్డి, రమణారావు, సిబ్బంది యం.హరినాధసాయి గ్రామ పెద్దలు వెటర్నరీ సిబ్బందితో పాటు దొడ్లడైరీ రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ

తొట్టంబేడు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొణతనేరి గ్రామంలో మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు, సర్పంచ్ బాలాజీరెడ్డిల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీచేశారు. అనంతరం ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిబాబునాయుడు, సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి జలజ, సచివాలయ పోలీస్ చిత్ర, సర్వేయర్ ఆరిఫ్, శ్రీను, రాజేంద్ర, కస్తూరయ్య తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

అవగాహన పెంచడానికి నాటక ప్రదర్శనలు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి నాటక ప్రదర్శనలు చేపిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాశం పార్కు, వైకుంఠపురం ఆర్చ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ నాటక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్ పై విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఆర్ఓ సేతుమాధవ్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య సుమతి, మెప్మా కృష్ణవేణి, మస్తాన్, మిమిక్రి కళాకారుడు విజయకుమార్, వే ఫౌండేషన్ అంకయ్య తదితరులు ఉన్నారు.

పార్టీ నేత కుటుంబానికి ఆర్థిక సాయం

నగరి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి 17వ వార్డు బీఎస్పీ ఏఈ నేత పిచ్చయ్య మృతి చెందగా, ఆయనకు నివాళులర్పించిన జై భీమ్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పవర్ రామచంద్రన్ ఆయన కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శి నాగూర్, జై భీమ్ సేన జిల్లా అధ్యక్షులు ధూళిబాబు, సభ్యులు ముదిరాజ్, ముత్తు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(బాలికల) శుక్రవారం మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు భువనేశ్వరి, మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పర్యాటక దినోత్సవం ప్రాముఖ్యత ప్రయోజనాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

శ్రీ ద్రౌపదీ దేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో అక్టోబరు 3 తేదీ గురువారం నుంచి 12తేదీ వరకు శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించ నున్నట్లు ఆలయ కోవిల్‌కార్‌సాల్వాకం, కిష్టప్ప మొదలి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం అభిషేకం, సాయంత్రం ప్రత్యేక అలంకరణలు ఉంటాయని తెలిపారు.

అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: అసంఘటిత కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు రమేష్ మునిరాజులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా బాల గురవయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా స్కీం వర్కర్లను వేధిస్తున్నారని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు షరా మామూలై రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ బిల్డింగ్ వర్కర్లు, సంఘమిత్రలు, ఆటో వర్కర్లు, హమాలీలు, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవర సినిమా విజయోత్సవంలో అభిమానులు

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: దేవర సినిమా విజయోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో సంబరాలను బాలకృష్ణ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కేంద్రంలో దేవర సినిమా భారీ స్థాయిలో బ్యానర్లను ఏర్పాటు చేసి శుక్రవారం ఎన్‌టీఆర్ చిత్రపటానికి అభిమానులు పాలాభిషేకం చేసి బాణసంచా పేల్చి కేక్‌కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరిగింది. కార్యక్రమంలో చిరుకూరి మునిచంద్రనాయుడు, బాలకృష్ణ, కిరణ్, అశోక్, తేజ, పెంచలయ్య, గోపికృష్ణ, రామ్ నందన్, ఎన్‌టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు జనసేనలో చేరిక

బుచ్చినాయడు కండ్రిగ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: కొత్తపాళెం సర్పంచ్ శుభరత్నమ్మ, పార్లపల్లి సర్పంచ్ ఎన్.వెంకటస్వామి, 50 మంది వైసీపీ నాయకులు శుక్రవారం తిరుపతిలో జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పల లావణ్య కుమార్, మండల అధ్యక్షులు బాషా సమక్షంలో చేరడం జరిగిందని కేతారి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేతారి హరిప్రసాద్‌కు నాయకులకు కండువా కప్పి జనసేన నాయకులు ఆహ్వానించారు. జనసేన పార్టీ, కూటమి ప్రభుత్వం పరిపాలన విధానం నచ్చి జనసేన పార్టీలో చేరడం జరిగిందని హరిప్రసాద్, ఎన్.చలపతి తెలిపారు. జనసేన పార్టీలో కోలా సుబ్రహ్మణ్యం, కె.ప్రభాకర్‌రెడ్డి, కె.తిరుపాలు, కె.ధర్మయ్య, దేవత, గురు, ఎన్.నారయ్య, దాసు, ఆనంద్, శ్రీనివాసులు, తేజ, కిరణ్, అశోక్ జనసేన పార్టీలో చేరారు.

అధిష్టానం ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెండ్ ఎత్తి వేయాలి

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్నప్పటికి కొందరి స్వార్థ పరుల ఉచ్చులు ఇరుక్కుని నేడు ఇలాంటి సంఘటనలు సమస్యలు ఎదుర్కొనప్పటికి దేవుని ఆశీర్వాదంతో కుతంత్ర రాజకీయాలు ఎదుర్కొని కడిగిన ఆణిముత్యంలా ఎమ్మెల్యే ఆదిమూలం కోర్టులో విజయం సాధించడం జరిగిందని మునిచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పెంచలయ్య, కత్తి ధర్మయ్య సమావేశంలో తెలిపారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిమూలంను ఎదుర్కొనలేక కొందరు రాజకీయ స్వార్థ పరులు ఇలాంటి ఆరోపణలకు పాల్పడారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంచలయ్య, బాలకృష్ణ, గోపికృష్ణ, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

అష్టావధానంలో యువశ్రీ మురళికి సత్కారం

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: శుక్రవారం తిరుపతి నగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో జరిగిన తిరుపతి జిల్లా పరిధిలోని బడి పిల్లలచేత రాయించిన బాల సాహిత్య కథలు పుస్తకం బలకథానిధి పుస్తకావిష్కరణ, అష్టావధానం కార్యక్రమంలో పృచ్ఛకుడిగా పాల్గొన్న కవి, రచయిత తెలుగు ఉపాధ్యాయలు యువశ్రీ మురళిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, కార్యక్రమ నిర్వాహకులు డా. నెమిలేటి కిట్టన్న, శతావధాని ఆముదాల మురళి తదితరులు శాలువ, జ్ఞాపికతోసత్కరించారు.

వైసీపీ నాయకులకు ముందస్తు నోటీసులు

విజయపురం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త: మండలంలోని వైసీపీ నాయకులకు శుక్రవారం పోలీసులు ముందస్తు నోటీసులు అందించారు. తిరుపతిలో మాజీ ముఖ్యమంత్రి జగన్ నిర్వహించే పర్యటకు శాంతిభద్రతల దృష్ట్యా హాజరు కాకూడదని ఎస్ఐ బలరామయ్య, ఏఎస్ఐ గోవిందరాజులు గ్రామాల్లో గుర్తింపుపొందినవైసీపీనేతకునోటీసులు అందించారు.

స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి విద్యార్థులు ప్రతిభ

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల పార్మాకాలజి విభాగం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి విద్యార్థులు డ్రాయింగ్, స్కిట్ పోటీలలో ప్రథమ, ద్వితియ బహుమతులు అందజేశారని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి బిపిటి 2వ సంవత్సరం చదువుతున్న కె. తనూజ, పి. మునికృష్ణ, జె. శ్రీజ, బేబి స్వరూప, మేఘన, జి. అభినయ విద్యార్థిని, విద్యార్థులకు డ్రాయింగ్, స్కిట్లు ప్రదర్శించి నందు మొదటి, ద్వితియ బహుమతులు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ విద్యార్థులను అభినందించారు. స్విమ్స్ నందు మాస్టర్ హెల్త్ చెకప్ వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9441239836కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ ప్రొ. డా. కె. మాధవి, డా. శాంతి పాల్గొన్నారు.

చంద్రగిరి సబ్ రిజిష్ట్రసార్‌గా కొండారెడ్డి

చంద్రగిరి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: : చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్‌గా జి.వి.కొండా రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ మోహన్‌బాబు నగరికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కొండా రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ డి.ఎస్.వై.అధ్యక్షుడు సి.ఎం.కేశవులు ఆధ్వర్యంలో రైటర్స్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు, మధ్యతరగతి, నిరుపేదలకు సత్వర సేవలు అందించడానికి తమవంతు కృషి చేస్తానన్నారు.

జగన్ డిక్లరేషన్...ఇవ్వరన్న భూమన

తిరుపతి,సెప్టెంబర్ 27ప్రభాతవార్త: వైసిపి అధినేత .మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుమల పర్యటన ఉన్నందున డిక్లరేషన్‌లో సంతకం చేయాల్సిన అవసరం లేదని మాజీ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన ఎందుకు సంతకం చేయాలని కూటమి నేతలను ప్రశ్నించారు.ఈ అంశంపై వివాదం వద్దని, సంతకం చేయకుండానే ఆలయంలోనికి వెళ్ళి స్వామివారిని దర్శనం చేసుకుంటామన్ని, ఎవరు అడ్డుకుంటారో చూస్తామని అన్నారు.

దొంగతనం కేసుల్లో ఇద్దరు దొంగలకు జైలు శిక్ష

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మూడు దొంగతనం కేసుల్లో ఇద్దరు దొంగలకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజెసిజె కోర్టు జడ్జి సంధ్యారాణి తీర్పునిచ్చారు. తిరుపతి రూరల్ మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామంకు చెందిన ముద్దాయిలు మణికంఠ, లక్ష్మి చెరువు గ్రాం తిరుపతి రూరల్ మండలంకు చెందిన ఇద్దరు ముద్దాయిలకు రెండు సంవత్సరాలు సాధారణ శిక్ష శుక్రవారం విధించారు. ఈ కేసుల నిరూపణకు విశేష కృషి చేసిన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుళ్ ఫణీంద్ర పిపి భాను కిరణ్మయి, కోర్టు మానిటరింగ్ సిస్టం సిబ్బందిని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు అభినందించారు.

జాబ్ మేళాలో 22 మంది ఎంపిక

పుత్తూరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 22 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించినట్టు ప్రిన్సిపల్ జి.కోటేశ్వరయ్య తెలిపారు. మేళాలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, బిజెడ్ ఫిన్ సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ గ్రూప్ ఆఫ్ బ్యాంక్ జోన్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ కంపెనీల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. మొత్తం 56 మంది హాజరవగా 22 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఎపిఎస్ఎస్‌డిసి ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, ఎస్ఇఇడిఎపి ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్ పాల్గొన్నారు.

అనుమతి లేనిదే ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదు

పాకాల, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : పాకాల మండలం పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో రాల్యీలు, ఊరేగింపులు సభలు సమావేశాలు నిర్వహించాలనుకుంటే చట్ట ప్రకారం పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని పాకాల సిఐ మద్దయ్య ఆచారి శుక్రవారం తెలిపారు. ఏదైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయాలంటే ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, పోలీసు వారి ఉత్తర్వులను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ చేయడానికి పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెద్ద గోర్పాడులో స్వర్ణాంధ్ర 2047 స్వచ్ఛతాహీ కార్యక్రమం

పాకాల, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త : పాకాల మండలం పెద్దగోర్పాడు పంచాయతీ కార్యాలయం నందు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా పాకాల ఎంపిడిఓ ప్రభాకర్ పాల్గొని వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అభివృద్ధిపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. గ్రామ సభ నందు హౌసింగ్ బోర్డు ఏఈ మహేష్ నాయుడు, పంచాయితీ కార్యదర్శి అభిద్, టిడిపి నాయకులు చెంగల్రాయులు నాయుడు, నాని, వెంకటేష్ బాబు, అరుణ, యుగంధర్ చౌదరి, చక్రవర్తి, దేవరాజులు, మనోజ్, కార్తీక్ సచివాలయఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దయచేసి బ్రిడ్జ్ పై రోడ్డు నిర్మాణం చేపట్టండి

బ్రహ్మోత్సవాల్లో అన్నప్రసాదం, పారిశుధ్యానికి పెద్దపీట

-టిటిడి ఈఓ శ్యామలరావు

తిరుమల,సెప్టెంబర్ 27 ప్రభాతవార్తప్రతినిధి: వేంకటేశ్వరస్వామి దర్శనంతో బాటు అక్టోబర్‌లో జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్న ప్రసాదాలు, పారిశుద్యానికి పెద్దపీట వేయాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు సూచించారు. భక్తులకు రాజీలేని ధోరణితో సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అన్నప్రసాదం, పారిశుధ్యం విభాగాలు రెండు ముఖ్యమైనవని, రెండు విభాగాలు సమన్వయం చేసుకుని దర్శనానికి వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, సౌకర్యాలపై శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్య భవనంలో చివరిసమావేశం నిర్వహించారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓలు ,ఎఫ్ఎసిఎఓ బాలాజీ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఈఓసమీక్షించారు.

పోలేరమ్మకు అత్యాధునిక సాంకేతికతతో రథాన్ని తయారుచేస్తా

-ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : వెంకటగిరి గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరలో ఊరేగింపు కోసం అత్యధిక సాంకేతికత ఉన్న రథమును తయారు చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి ఊరేగింపుకు రథం లేనందువల్ల ఇబ్బందులు జరుగుతున్నాయని తెలిపారు. దాతల సహకారంతో రథం తయారు చేయిస్తానని తెలిపారు. దాతల సహకారంతో అమ్మవారి కిరీటం పాదాలను తయారు చేయించామని చెప్పారు. రథం తయారీకి దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పోలేరమ్మ జాతర అందరి సహాయ సహకారాలతో విజయవంతంగా జరిగిందని చిన్న చిన్న లోటు పాట్లు జరిగి ఉండవచ్చు అని తెలిపారు. కొందరు వారి సొంతంగా పాసులు తయారు చేయించుకొని వచ్చినట్లు చెప్పారు. ఈ సంవత్సరం జరిగిన లోటు పాట్లను వచ్చే సంవత్సరం సరిదిద్దుతామని చెప్పారు. అమ్మవారు కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. పోలేరమ్మ అమ్మవారు జాతర సందర్భంగా వంద రూపాయిలు 300 రూపాయిలు టికెట్ల ద్వారా 26లక్షల 74 వేల రూపాయిలు, హుండి ద్వారా 22లక్షల 51 వేల 975 రూపాయిలు ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సరం టికెట్లు ద్వారా 33 లక్షల రూపాయిలు హుండి ద్వారా 21 లక్షల 91 వేల రూపాయిలు వచ్చిందని తెలిపారు. 500 రూపాయిలు టికెట్లు లేనందువల్ల ఆదాయం కొంత తగ్గిందని తెలిపారు. సామాన్య భక్తులపై పెనుభారం ఉండకూడదని 500 రూపాయిలు టికెట్లు వేయించినట్లు చెప్పారు. సమావేశంలో ఆలయం ఈవో శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు మురళీకృష్ణ తాండవ చంద్ర, వెంకటేశ్వర్లు, విశ్వనాథం, శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ నిధి ఖాతాలు సత్వరం క్రమబద్ధీకరణ

- జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడుకు యుటిఎఫ్ విజ్ఞప్తి

చిత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: ఉద్యోగ, ఉపాధ్యాయుల జడ్పీ భవిష్యత్ నిధి ఖాతాలను సత్వరం క్రమబద్ధీకరించాలని యుటిఎఫ్ నాయకులు జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. జడ్పీ సిఇఓ ఛాంబర్‌లో శుక్రవారం యుటిఎఫ్ నాయకులు నూతనంగా జడ్పీ సిఇఓగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ నాయుడును కలిసి అభినందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జడ్పీ సిఇఓతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ నిధి ఖతాలు, నెలవారీ వివరాలను ఆన్‌లైన్ ద్వారా తీసుకోవడానికి విశేషంగా కృషి చేశారని, 2021-22 నుండి 2023-24 వరకు సంవత్సరాల వారీగా ఉద్యోగి ఖాతాలో వున్న భవిష్యత్ నిధికి వడ్డీ జమ చేసి అందుబాటులోకి తీసుకురావాల్సివుందన్నారు. అలాగే ఇటీవల కాలంలో టీచర్ల బదిలీలు, పదోన్నతులతో కొందరు నూతన పాఠశాలల్లో నియామకం పొందివున్నారన్నారు. ఈ విషయంపై ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పాఠశాలల చిరునామాలను సవరణ చేయాల్సివుందన్నారు. అలాగే నామిని పేర్లను సైతం మార్చుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. అంతర్‌జిల్లా బదిలీల ద్వారా బదిలీ పొందిన టీచర్ల జడీప పిఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్‌లో వుంచాలన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫైనల్ పేమెంట్‌ను సెటిల్‌మెంట్ చేయాలన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరం రుణాలు మంజూరు చేయాలని, కారుణ్య నియామకాలను సత్వరం చేపట్టాలని కోరారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడును కలిసిన వారిలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్‌నాయుడు, మణిగండన్‌లు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహానా బేగం, కె.రెడ్డప్పనాయుడు, ఎస్‌పి బాషా, సరిత, డి,ఏకాంబరం, ఎం.పార్థసారధి తదితరులు వున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి. ఉత్సవాల చివరిరోజు తెప్పోత్సవం సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలురకాల కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రఖ్యాత కళాకారులచే వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈమేరకు భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యంలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి.

గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం, లడ్డు వేలం

కాణిపాకం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాల చివరిరోజు శుక్రవారం రాత్రి గణనాధునికి గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 21 రోజులు పాటు జరిగిన సా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి జరిగిన తెప్పోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారి లడ్డును వేలం నిర్వహించారు. చిత్తూరు విజయం విద్యా సంస్థల అధినేత లడ్డును రు.4.25లకు పాడుకున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది అత్యధిక ధర పలికనట్లు తెలిసింది. తెప్పోత్సవం అనంతరం సా స్వామివారికి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తెప్పలపై విహరించి సేదతీరిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులకు తిరిగి గ్రామోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు వంటి వివిధరకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈసందర ్భంగా నారికేళ, కర్పూర హారతులతో స్వామివారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

గణేష్ దీక్ష ఇరుముడులు సమర్పణ

కాణిపాకం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: గణేష్‌దీక్ష మాలధారణ చేపట్టిన భక్తులు శుక్రవారం కాణిపాకంలో ఇరుముడులను సమర్పించారు. కాణిపాకం దేవస్థానంలో గత కొన్నేళ్ళుగా గణేష్‌దీక్షా మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈమేరకు ఆలయ పరిసర గ్రామాలకు చెందిన భక్తులే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గణేష్‌దీక్ష మాలధారణ చేపట్టిన భక్తులు శుక్రవారం బ్రహ్మోత్సవాల చివరి రోజు కాణిపాకం చేరుకుని స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు దీక్ష పూర్తి చేసుకుని కాణిపాకం చేరుకుని ఆలయంలో స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. వీరు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన గణేష్‌దీక్షా మందిరంలో ఇరుముడులను సమర్పించారు. వీరికి ఆలయం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, ఇన్స్‌పెక్టర్‌లు చిట్టిబాబు, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊక విజయకుమార్‌ను సత్కరించిన బలిజసేన

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : తిరుపతి నెహ్రూ నగర్‌లోని కార్యాలయ లో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మౌలిక సదుపా యాల డైరెక్టర్‌గా ఎన్నికైన శుభ సందర్భంగా బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఊక విజయకుమార్ తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులని, సమాజసేవలో తనవంతు కృషి చేశారని అలాంటి వ్యక్తికి కీలకమైన పదవి రావడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊక విజయకుమార్, బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, ఆముదాల వెంకట కృష్ణ, కృష్ణమూర్తి, శేషాద్రి, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనలను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : అక్టోబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు తిరుమలలో పర్యటించనున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాన్ పర్యటనల విజయవంతంపై ఎన్డీఏ కూటమి నాయకులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల మొదటి రోజైన అక్టోబర్ 4వ తేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వామి వారికి పట్టు వస్త్రాలు సతీసమేతంగా సమర్పించనున్నారు. అలాగే ప్రాయశ్చిత్త దీక్షలు ఉన్న జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాన్ అక్టోబర్ 2వ తేది సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు చేరుకోనున్నారు. 3వ తేది ఉదయం శ్రీ వారిని పవన్ కల్యాణ్ దర్శించుకుంటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బిజేపి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా జుంలేపీర్ షావలి అల్లాహ్ గంధోత్సవం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వెలసిన జుంలేపీర్‌షా వలి అల్లాహ్ వార్షిక గంధోత్సవం మెరవణి శుక్రవారం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా సాగింది. దర్గా వద్ద సాయంత్రం నుంచి యువకుల్లో జోష్‌చోటు చేసుకుంది. అతిధుల రాకతో సందడి చోటు చేసుకుంది.పురాతనమైన దర్గా వద్ద వార్షిక ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ దర్గా ప్రాధాన్యతను గుర్తించి పలువురు ప్రముఖులు వలీ అల్లాహ్‌ను దర్శించుకుంటున్నారు. మొక్కులు తీర్చుకుంటున్నారు.ఈ నేపథ్యంలో గంధోత్సవంలో భాగంగా శుక్రవారం ముజావర్ సయ్యద్ అహమ్మద్ ఇంటి నుంచి కలశంలో గంధం నింపి ఊరేగింపుజరిపారు.బళ్ళారి డ్రమ్ముల మోతతో పట్టణం దద్దరిల్లింది. తాషాలతో యువకులు నాట్యాలు చేస్తూ ప్రజల్ని ఆకట్టుకుంటూ ముందుకు సాగారు. నౌరంగ్ బాజాలు,ఫక్కీర్లు జరబ్బులతో భక్తి గీతాలను పాడుతూ ఊరేగింపు ప్రారంభమైంది. శ్రీకాళహస్తిలో వెలసిన జుంలేపీర్‌షా వలి అల్లాహ్ గంధోత్సవం సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు. రోడ్డు పై నుంచి దర్గా వరకు విద్యుత్ దీపాల తోరణాలతో అలంకరించారు. పచ్చని జెండాలతో ముస్తాబు చేసారు. గంధోత్సవం దర్గా నుంచి బయలుదేరి తేరువీధి,బజారువీధి,నగరి వీధి, ముత్యాలమ్మగుడి వీధీ, బహదూరుపేట, కొత్త పేట, పాతవరదయ్యపాళెం రోడ్డు,జయరామారావు వీధుల మీదుగా సాగింది.ఉత్సవంతో పాటు ముజావర్ కుటుంబానికి చెందిన జహంగీర్ సాహెబ్, బాబాఫరీద్, కమిటి నిర్వాహకులు నాగేశ్వరరావు, రాజేశ్వరరావుల పర్యవేక్షణలో సాగింది.

దొంగతనం తేలాక పాదయాత్రా? : ఎంఎల్‌ఏ సుధీర్

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : ఐదేళ్ళ పాటు అరాచక పాలన సాగించి దోచుకొని దాచుకొని దొరికిన తరువాత నేను దొంగనుకాదని మభ్యపెట్టటానికి పాదయాత్రకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పూనుకోవటం సిగ్గు చేటని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు పరిపాలించిన జగన్మోహన్‌రెడ్డి ఏం జరిగిందో తెలియదన్నట్లు స్వామి వారి పవిత్రమైన లడ్డు ప్రసాదంలో అపచారాలు జరిగితే ఎక్కడ అపచారం జరిందనేది పరిశీలించుకొని స్వామి వద్ద క్షమాపణ కోరాల్సిన ఆయన మళ్ళీ పాదయాత్ర అంటూ ఎవరిని మభ్యపెట్టడానికి పాదయాత్ర అంటూ డ్రామాలాడుతున్నారని ప్రశ్నించారు.ఐదేళ్ల పాటు ప్రజలు దోచుకున్నారు. దాచుకున్నారు. చివరికి కలియుగ దైవానికి కూడా శరగోపం వేసిన జగన్ అండ్‌కో ఆరాచకాలు ఆయనకు తెలియదా? అని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు.

రాష్ట్రంలో ఎక్కడ అడుగుపెడితే అక్కడ సంప్రోక్షణ చేయాలి:

ఆంధ్ర రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ ప్రాంతంలో అడుగుపెడితే ఆప్రాంతాలను 'సంప్రోక్షణ' చేయాలని సుధీర్‌రెడ్డి కోరారు.ఈ మేరకు జనం అప్రమత్తం కావాలని కోరారు.తిరుమలలో జరిగిన ఆపచారానికి సంబంధించి హిందువు అనే ప్రతి ఒక్కరు జగన్‌ను కాలుపెట్టకుండా అడ్డుకోవాలన్నారు.నయవంచకుణ్ణి అడ్డుకోవాలన్నారు.సమాజానికే కాదు సాక్షాత్తు భగవంతునికి కూడా అపచారం చేయటానికి వెనుకాడని జగన్‌ను ఓటు తో సమాధానం చెప్పిన ప్రజలు ఎక్కడా తిరగకుండా అడ్డుకోవాలని సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యాటనలో జాగ్రత్త

-జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా.ధనంజయ వై.చంద్రచూడ్ ఈ నెల సెప్టెంబర్ 28,29 తేదీలలో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని, అలాగే జాయింట్ పార్లమెంటరీ కమిటీ, నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీల పర్యటనల నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి చిన్న పొరపాట్లు తావివ్వకుండా విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జెసి, ఆర్డివో శ్రీకాళహస్తి, ఎస్డిసి ప్రోటోకాల్ చంద్రశేఖర్ నాయుడు, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి ప్రముఖుల పర్యటనలలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా విజయవంతం చేయాలని పలు సూచనలు చేశారు. అలాగే 29న జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యుల తిరుపతి జిల్లాలో పర్యటించనున్నట్లు, అలాగే అక్టోబర్ 1 నుండి 8వ తేది వరకు ఎనిమిది రోజుల పాటు నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం పర్యటిస్తుందని అందులో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై గ్రామీణ కేంద్ర బృందం క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఈవో జడ్పి ఆదిశేషారెడ్డి, డిఎంహెచ్ఓ శ్రీహరి, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, డిఆర్ఎ ప్రభావతి, జిల్లా పంచాయితీ అధికారిని సుశీల దేవి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో మహాజనసభ

తొట్టంబేడు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని తంగేళ్ళపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాజన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి పి.రవిబాబు హాజరవగా ఆయనకు పిఎసిఎస్ సిఈవో పి.చిరంజీవిరెడ్డి స్వాగతం పలికారు. రైతులతో ఏర్పాటు చేసిన సభలో తిరుపతి అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి పి.రవిబాబు మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 01 నుంచి 2024 ఆగస్టు 31 వరకు జరిగిన సంఘ లావాదేవీలు జమఖర్చులు ఆమోదించడం జరిగిందన్నారు. సంఘం యొక్క 2023-24 సంవత్సరం ఆడిట్ నివేదికను రైతులకు చదివి వినిపించారు. కంప్యూటరీకరణలో భాగంగా జాయింట్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌సి నంబర్ 350/2024/సి1, 23.8.2024 ప్రకారం సంఘ సభ్యునిగా ఉండి మృతిచెందిన వారిని సంఘ పరిధిలో నివసించక వేరే గ్రామాలకు వలస వెళ్ళిన వారిని సంఘపరిధిలో ఉంటూ గత రెండు సంవత్సరాలుగా సంఘంలో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరపని వారిని సంఘ సభ్యత్వం నుంచి తొలగించి వారి భాగస్వామ్య ధనాన్ని రుణదాతలు నందు ఉంచుటకు చర్చించారు. కార్యక్రమంలో సినియర్ ఇన్‌స్పెక్టర్ అమరవేలు, మురళీమోహనకృష్ణ, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది శేఖర్, శ్రీను మండలంలోని రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముళ్ళపూడి గిరిజన కాలనీలో సమస్యల తిష్ట:

విషజ్వరాలతో జనం సతమతం

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ముళ్ల పూడి గిరిజన కాలనీలో సమస్యలు తిష్టవేసి జనం సతమతమౌతున్నారని జనం విష జ్వరాలతో తల్లడిల్లుతున్నారని శుక్రవారం జరిగిన సమావేశంలో నాయకులు శివమెత్తారు. గ్రామాల్లో సమస్యలురాజ్యమేలుతుంటే అధికారులు పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు. ముళ్ళపూడి గిరిజన కాలనీలో బత్తెమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి హాజరయ్యారు.ఈగ్రామం శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని దీర్ఘకాలంగా పరిపాలిస్తున్న నాయకుని స్వగ్రామానికి సమీపంలో ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గిరిజన కుటుంబాలు నివాసముంటున్న కాలనీలో మంచినీరులేక బోరు పని చేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్న బోరు పని చేయక బోర్ పది రోజుల కొక మారు మోటార్ కాలిపోతుందన్నారు. ఇక కాలనీలో జనం జ్వరాలతో తల్లడిల్లుతున్నారన్నారు.ఈ కాలనీ గురించి వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. కాలనీకి వెళ్ళు దారిలో కనీసం లైట్లు లేదు. చీకటిలో వెళ్ళాలంటే విషపురుగులతో భయం గుప్పిట్లో గడుపుతున్నారన్నారు.ఈ సమావేశంలో సిపిఐ కార్యదర్శి జనమాల గురవయ్య, మండల కార్యదర్శి మించల శివకుమార్, ఏరియా అధ్యక్షుడు మురళి, బతుకమ్మ, చెంచమ్మ, నాగమ్మ, వెంకటమ్మ, విజయ, అంకమ్మ,రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజి మాధవయ్యకు ఘనంగా సన్మానం

పుత్తూరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త : రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్‌గా పదవి లభించిన తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్యను స్థానిక టిడిపి నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువాలతో సన్మానిస్తూ ఆయనకు పదవి రావడం పట్ల తమ సంతోషం, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ కార్పొరేషన్ నుంచి పద్మశాలి కులస్థుల్లో అవసరమైన లబ్దిదారులకు, పేదవారికి సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే మొదటి నుంచి తాను కుల, మతాలకు అతీతంగా రాజకీయాల్లో ప్రజా సేవ చేస్తున్నానని, దానిని కొనసాగిస్తానని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, 12వ వార్డు అధ్యక్షుడు మధు, చిత్తూరు పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం.చెంచయ్య, ఐటిడిపి సమన్వయకర్త ఈశ్వర్ యాదవ్, 19వ వార్డు అధ్యక్షుడు ఉమాశంకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కోట గజపతి, ఇంకా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకృతమైన బోయకొండ గంగమ్మ ఆలయం

బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం పుష్పాలంకృతమై భక్తులను కనువిందు చేసింది. దేవనహళ్ళికి చెందిన చంద్రశేఖర్, మనోహర్, సతీష్‌లు యేటా దసరా మహోత్సవాలకు ముందు ఆలయంలో పుష్పాలంకరణ చేయడం ఆనవాయితీ వస్తోంది. ఈ క్రమంలో అమ్మవారి గర్భాలయంతోపాటు ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో రూ. 4లక్షలు విలువ చేయు 9రకాల పుష్పాలంకరణ కన్నుల విందుగా చేసారు. దాతలను ఇఓ, ఉపకమీషనర్ జె.ఏకాంబరం సాదరంగా ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి కోటి రూపాయాలు విరాళం

కోట,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : సీఎం చంద్రబాబు పిలుపు మేరకు వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, పలువురు వ్యక్తులు, వ్యాపారస్థులు, వరద బాధితుల్ని ఆదుకోవడానికి స్వచ్ఛంగా ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు ఇస్తున్నారు. కోట మండలం చిట్టేడులోని సాగర్ గ్రంధి ఆక్వా ఎక్సెపోర్ట్ కంపెనీ (జీ.వి.ఆర్) ఎండి, గ్రధి చల్లారావు, బాలజీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గూడూరు శాసన సభ్యులు డాక్టర్, పాశిం సునిల్ కుమార్ సమక్షంలో సీఎం రిలీఫ్ పండ్ కు కోటి రూపాయాలను చెక్కును అంద చేశారు. వారితో పాటు బీద రవిచంద్ర కూడా ఉన్నారు.

పేదల ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించండి

-నెలముందు చెప్పినా పట్టించుకోరా : బొజ్జల రిషితారెడ్డి

తొట్టంబేడు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె ఆస్పత్రిలో పేదలకు అందుతున్న వైద్యసదుపాయాల్లో నిర్లక్ష్యంపై అవాక్కయ్యారు. ఓ దశలో రిషితారెడ్డి